ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025



'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి: డీఈవో

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి తిరుపతి నాయుడు ఆదేశించారు. గురువారం గుమ్మలక్ష్మీపురం జడ్పీ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు , ఉపాధ్యాయులతో మాట్లాడారు. టెన్త్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసి విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి చేయాలని సూచించారు. అంతకముందు హైస్కూల్‌లో నిర్వహించిన జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు.

ఇంకా 150 ఉన్నాయ్!

- రోడ్డు సౌకర్యానికి నోచని గిరి శిఖర గ్రామాలు
- తప్పని డోలీల మోత
- అత్యవసర సేవలకు కొండ దిగి ఎక్కాల్సిందే..
- కిలోమీటర్ల కొద్దీ కాలినడకనే..
- మౌలిక వసతులకు నోచని వైనం
- ఇబ్బందుల్లో గిరిజనులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు



బాపన్నగూడ నుంచి దిగువ ప్రాంతానికి వస్తున్న గిరిజనులు

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరి శిఖర గ్రామాల్లో ప్రజల కష్టాలు తీరడం లేదు. ప్రధానంగా రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వేళల్లో వారికి డోలీ మోతలు తప్పడం లేదు. పంటలు, అటవీ ఉత్పత్తులు విక్రయించాలన్నా.. సంక్షేమ పథకాలు పొందాలన్నా.. కిలోమీటర్ల మేర నడిచి కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది. జిల్లాలో ఇంకా 150కి పైగా రోడ్డు సౌకర్యం లేని గిరిజన గ్రామాలు ఉన్నాయి. గత వైసీపీ సర్కారు నిర్లక్ష్యం కారణంగా ఆయా ప్రాంతాలు మౌలిక వసతులకు నోచుకోలేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఆ ప్రాంత వాసులంతా ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

ఇదీ పరిస్థితి

- జిల్లాలో 15 మండలాల్లో 451 పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో మొత్తం 984 గ్రామాలు ఉన్నాయి. భామిని, సీతంపేట, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, పాచిపెంట, మక్కువ, సాలూరు మండలాల్లో 300లకు పైగా గిరిజన గ్రామాలున్నాయి. ఇందులో పలు ప్రాంతాలు ఆంధ్ర-ఒడిశా సరిహద్దులో ఉన్నాయి. కాగా మారుమూల ఈ గిరిజన గ్రామాలకు అధికారులు గాని, ప్రజాప్రతినిధులు గాని వెళ్లాలంటే చాలా కష్టం. రోడ్డు సదుపాయం లేకపోవడంతో 108, 104 వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి. అత్యవసర వేళల్లో ఆయా గ్రామ గిరిజనులు ఫోన్ చేస్తే రోడ్డు అందుబాటులో ఉన్నంతవరకు మాత్రమే 108 వాహనం వస్తుంది. అక్కడి వారు రోగులను డోలీపై మోసుకుంటూ తీసుకెళ్లాల్సి వస్తోంది. రాళ్లు, రప్పలపై నుంచి కిలో మీటర్ల దూరం నడిచి వారు 108 వాహనం వద్దకు చేరుకోవాల్సిన దుస్థితి. ఆసుపత్రిలో ప్రసవమైన తర్వాత తల్లీ బిడ్డను క్షేమంగా చేర్చే 102 సర్వీసు రోడ్డు సౌకర్యం ఉన్నంతవరకే. ఆ తరువాత ఆ బాలింత, చంటి బిడ్డను ఎత్తుకొని గిరి శిఖర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక అత్యవసరంగా ఉపయోగపడే ఫీడర్ అంబులెన్స్‌లు కూడా రోడ్డు సౌకర్యం ఉన్నంతవరకే వస్తున్నాయి.
- గిరిజనులు పండించే జొన్నలు, సజ్జలు, రాగులు, గంటెలు, గోధుమలతో పాటు వివిధ అటవీ ఉత్పత్తులు అమ్ముకోవాలన్నా పల్లపు ప్రాంతాల్లో వారపు సంతలకు చేరుకోవాలి. అయితే ఇందుకోసం వారు కిలో మీటర్ల దూరం వాటిని మోసుకుంటూ కొండ దిగి ఎక్కాల్సి వస్తోంది.
- సకాలంలో వైద్య సేవలు అందక ఏటా ఎంతోమంది గిరిజనులు, గర్భిణులు, బాలింతలు మృతి చెందారు. కొన్ని గిరిజన గ్రామాలకైతే వాగులు, వంకలు దాటాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా కూడా కొండ శిఖర గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయకపోవడంపై ఆయా ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారుల దుస్థితిపై ఐటీడీఏ ఈఈ మణిరాజ్‌ను వివరణ కోరగా ఒకేసారి అన్ని గ్రామాలకు రహదారులు ఏర్పాటు కష్టమని తెలిపారు. పూర్తి వివరాలు చెప్పేందుకు ఆయన నిరాకరించారు.



జియ్యమ్మవలస మండలం చాపరాయిగూడ రహదారి ఇలా..

రోడ్డు సౌకర్యం లేని గ్రామాలు..

- గుమ్మలక్ష్మీపురం మండలంలో శిఖరపాయి, తోట, గోరటి, ఓంద్రుబంగి, ఓమాసి, అడ్డంగి, జంగిడిభద్ర, తదితర గిరి శిఖర గ్రామాలు ఉన్నాయి.
- కొమరాడ మండలంలో నయా, కుంతేసు పంచాయతీలలో 18 గ్రామాలతో పాటు మరికొన్ని ఉన్నాయి.
- కురుపాం మండలం తిత్తిరి పంచాయతీలో గేదెలగూడ, గాలిమానుగూడ, బంద్రసింగి, ఎగువ కీడవాయి, డెప్పిగూడ, డుంబిరి, జలగెడ్డ, ఎగువ ఆవిరితో పాటు మరో 20 గ్రామాలు.
- ఒబ్బంగి పంచాయతీలో జలుబుగూడ, తియ్యాలిగూడ, కాకిలితో పాటు మరో 17 గ్రామాలు.
- గుజ్జువాయి పంచాయతీలో నేరేడుమానుగూడ, మామిడిమానుగూడతో పాటు మరికొన్ని గ్రామాలు.
- జరడ పంచాయతీలో నెమలిమానుగూడ, గెడ్డగూడ, కంబమానుగూడ, ఈతమానుగూడ, మాలగాడిగూడ, దుమ్మంగి, మరో 14 గ్రామాలు ఉన్నాయి.

(మిగతా 8వ పేజీలో...)

గిరిజనులు నష్టపోరాదు

- ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ



జీసీసీ అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

పార్వతీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత ప్రజలకు ఎటువంటి నష్టం రాకుండా చూడాలని, వారికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందించా లని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశించారు. గురువారం తన కార్యాలయంలో జీసీసీ బ్రాంచి మేనేజర్లతో సమీక్షించారు. అటవీ ఉత్పత్తుల కొను గోలుతో గిరిజనులకు మేలు జరగాలన్నారు. డివిజన్ పరిధిలో ఉన్న డీఆర్ డిపోల పనితీరు మరింత మెరుగుపడాలన్నారు. నిత్యావసర సరుకుల కొనుగోళ్లు పక్కాగా జరగాలని ఆదేశించారు. గిరిజనుల నుంచి సేకరించే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులను ఎప్పటికప్పుడు గోదాములకు తరలించాలన్నారు. వాటి అమ్మకాలకు సంతలు, గ్రామాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మండల లెవీ స్టాక్ పాయింట్ల పనితీరు, డిపోలు, వసతిగృహాలకు అందిస్తున్న సేవలు, రైతుల వ్యవసాయ రుణాలపై ఆరా తీశారు. సాలూరు, పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురంలో సిబ్బంది వివరాలు, ఖాళీలపై సమీక్షించారు. డీఆర్ డిపో, సంత పాయింట్లు సమయపాలన పాటించాలన్నారు. సమావేశంలో సాలూరు, గుమ్మ లక్ష్మీపురం బ్రాంచి మేనేజర్లు రామారావు, వి.కృష్ణ ప్రసాద్, డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాలవలస కుటుంబానికి జగన్ పరామర్శ

- ఎన్నికల తర్వాత తొలిసారిగా పాలకొండకు వచ్చిన మాజీ సీఎం

8లో

నాటు.. ఎక్కడికక్కడే ఘాటు

- పొరుగు జిల్లాల నుంచి సారా దిగుమతి
- సరిహద్దు గ్రామాలకు హోల్‌సేల్‌గా తరలింపు



మెంటాడ, ఫిబ్రవరి 20((ఆంధ్రజ్యోతి): ఇరుగు పొరుగు జిల్లాల సరిహద్దులతో పాటు ఒడిశా సరిహద్దుల నుంచి జిల్లాలోకి పోటెత్తుతున్న నాటుసారా ప్రవాహాన్ని కట్టడి చేయడం ఎక్సైజ్, పోలీసు అధికారులకు సవాల్‌గా మారుతోంది. ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో గుట్టుగా సాగుతున్న తయారీ, విక్రయాలను అరికట్టడంలో తల మునకలైన యంత్రాంగం పొరుగు జిల్లాల నుంచి సారా రావడాన్ని అరికట్టలేకపోతోంది. అక్కడి సారా జిల్లా అంతా గుట్టుగా రవాణా అవుతోంది. పేదలే టార్గెట్ చేసుకుని వ్యాపారులు ఆయా కేంద్రాలకు సారాను చేర్చుతున్నారు. నెలకు లక్షల్లో ఆదాయం పొందుతున్నారు. పేదల ఆరోగ్యాన్ని బలిపీఠం ఎక్కిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ఒడిశా రాష్ట్రం కోరాపుట్, అలమండ ఏజెన్సీ ప్రాంతాల్లో అధికంగా సారా తయారవుతోంది. అక్కడి గిరిజనులు ఇదో స్వయం ఉపాధిగా చెప్పుకుంటున్నారు. కొండశిఖర గూడేలు, తండాల్లో తయారుచేసే నాటుసారాను ఆయా ప్రాంతాల్లో విక్రయిస్తూ పొరుగునున్న పార్వతీపురం జిల్లాకు చేర్చుతున్నారు. ఆపై గ్రామాల్లోని వ్యాపారులు టోకున కొనుగోలు చేసి ఎంపిక చేసుకున్న కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తున్నారు. ఇటు మెంటాడ మండలంలోని కూనేరు, కొండలింగాలవలస, వాణిజ, ఆంధ్ర, లోతుగెడ్డ, కారుమామిడి వలస, మిర్తివలస తదితర ప్రాంతాలకు సరిహద్దు జిల్లా అయిన అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నుంచి సారా జిల్లాలోకి ప్రవేశిస్తోంది. మరోవైపు ఎస్.కోట సరిహద్దు గ్రామాల నుంచి కూడా జిల్లాలోకి రవాణా అవుతోంది. గుర్ల మండలం దేవునికనపాక గిరిజనులు కూడా ఇదే తరహా వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. తక్కువ ఖర్చుతో కిక్కు కోరుకునేవారు నాటుసారాపై మక్కువ చూపుతున్నారు. హోల్‌సేల్ వ్యాపారులకు దండిగా లాభాలు తెచ్చిపెడుతున్నందున ఈ వ్యాపారం మూడు సీసాలు, ఆరు లోటాలుగా విస్తరిస్తోంది. ఆరోగ్యాన్ని అతి తక్కువ కాలంలో బలిపీఠం ఎక్కించే అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు, సామగ్రితో సారా తయారుచేస్తుంటారు. అయితే విక్రయాలు పెంచుకునేందుకు ఆరోగ్యానికి సారా మంచిదని వ్యాపారులు ప్రచారం చేస్తున్నారు. అడవుల్లో లభించే ఆయుర్వేద మూలికలు సారా తయారీలో వాడుతారని నమ్మబలుకుతున్నారు. ఎక్సైజ్ అధికారులు సారాపై యుద్ధం ప్రకటించి దాడులు చేసున్నా... ముడిసరుకును ధ్వంసం చేసి పట్టుబడేవారిపై కేసులు నమోదు చేస్తున్నా... తయారీదారులు, విక్రయదారులు కొత్త మార్గాల్లో వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు.

ఇటీవల నమోదైన కేసులు ఇలా..



- కొమరాడ మండలం రామలక్ష్మీపురం గ్రామ సమీపంలో 80 లీటర్లు సారాను అలానే దంగబద్ర వద్ద 40 లీటర్ల సారాను విజయనగరం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం స్వాధీనపరుచుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు.
- ఈనెల 10న పార్వతీపురం మండలం పెదమరికి వద్ద 520 లీటర్ల నాటుసారాను విజయనగరం ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనపరుచుకున్నారు. నలుగురిని అదుపు లోకి తీసుకొని నాలుగు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు.
- గతనెల 7న విజయనగరం జిల్లా మెంటాడ మండల అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం సరిహద్దు కొండప్రాంతంలో అరకు గజపతినగరం ఎక్సైజ్ పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేసి 1200 లీటర్ల బెల్లం వూటను ధ్వంసం చేశారు.
- ఈ నెల 17న ఆంధ్ర పోలీసులు లోతుగెడ్డ ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో 40 లీటర్ల సారాను స్వాధీన పరుచుకొని నలుగురిపై కేసు నమోదు చేశారు.

గౌరీ ఉత్సవాలు చూతము రారండి!

- ఐదు నెలల పాటు నిర్వహణ
- ఇదీ తుమరాడ విశిష్టత



6లో

అమ్మబోతే రూ.4 కొనబోతే రూ.15



- టమోటా ధరలు ఇవీ..

నష్టపోతున్న అన్నదాతలు

సోషల్ మీడియా పోస్టులపై నిఘా

- ఎస్పీ మాధవరెడ్డి



బెలగాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సోషల్ మీడియాలో అసభ్యకర, అనైతిక, విద్వేషాలు రెచ్చగొట్టేలా పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి హెచ్చరించారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. సోషల్ మీడియా పోస్టులపై నిరంతరం నిఘా ఉంటుం దన్నారు. యువత సోషల్ మీడియాను ఉపయోగించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ తదితర సామజిక మాధ్యమాల్లో ఇతరులను కించపరిచేలా, రెచ్చ గొట్టేలా, అవమానకర పోస్టులు పెడితే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులు పెట్టేలా ప్రోత్సహించడం, సహ కరించడం, కుట్ర చేయడం వంటివి కూడా చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రూప్‌లో అడ్మిన్లు కూడా జాగ్రత్త వహించాలని సూచించారు. యువత అనవరమైన చిక్కుల్లో పడి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.

రెండు నెలల్లో సిద్ధం కావాలి

- యూపీహెచ్‌సీల నిర్మాణంపై కలెక్టర్ ఆదేశం



పార్వతీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (యూపీహెచ్‌సీ) నిర్మాణాలు రెండు నెలల్లోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. రోగులకు మెరుగైన సేవలందించేందుకు మంజూరైన యూపీహెచ్‌సీలను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. పార్వతీపురంలో రెండు కేంద్రాలు ఈ నెలాఖరులోగా , సాలూరు యూపీహెచ్‌సీ మార్చికి, పాలకొండలో కేంద్రం ఏప్రిల్ నాటికి సిద్ధం కావాలన్నారు. ఎలక్ట్రికల్, ప్లంబింగ్, సెప్టిక్‌ట్యాంక్, ఫ్లోరింగ్ తదితర పెండింగ్ పనులపై దృష్టి సారించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. ● జిల్లాలో ఉపాధి హామీ, పల్లె పండుగ కింద మంజూరైన పనులన్నీ ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పూర్తి చేసిన నిర్మాణాలకు ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేయాలని అధికారులకు సూచించారు. కురుపాంలో పనులు వేగవంతం కావడం లేదన్నారు. దానిపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టిసారించాలన్నారు. రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని తెలిపారు. మినీగోకులాలు, పారంపాండ్స్, తదితర పనులపై ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. ప్రహరీ నిర్మాణాలన్నీ ఈ నెల 22 నాటికి గ్రౌండింగ్ కావాలని తేల్చి చెప్పారు. గడువులోగా పూర్తికాకుంటే అను మతులు రద్దు చేస్తామన్నారు. ఉపాధి హామీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలని తెలిపారు.

టీడీపీలోకి ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు

- జగన్ జిల్లాకు వచ్చిన రోజే పార్వతీపురంలో ఆ పార్టీకి భారీ షాక్

పార్వతీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రం పార్వతీపురంలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఎన్నికల అనంతరం ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం జగన్ తొలిసారిగా జిల్లాకు వచ్చిన రోజే ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఆయన పాలకొండ పర్యటనలో ఉండగా.. పార్వతీపురంలో 23, 24, 19 వార్డులకు చెందిన ముగ్గురు వైసీపీ కౌన్సిలర్లు ఎం.రవికుమార్, ఎం.ఉమామహేశ్వరి, బోదయ్య గురువారం టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇటీవల వైసీపీ అనుసరిస్తున్న విధానాలు తమకు నచ్చలేదని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కారణంగా టీడీపీలో చేరామని వారు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. టీడీపీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు.

- పార్వతీపురంలో 30 మంది కౌన్సిలర్లు ఉన్నారు. అయితే ఎన్నికలకు ముందు పదో వార్డుకు చెందిన వైసీపీ కౌన్సిలర్ కరుణ టీడీపీలో చేరారు. ఆ తర్వాత నలుగురు వైసీపీ కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలోకి వచ్చారు. తాజాగా మరో ముగ్గురు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మొత్తంగా ఏడుగురు చేరగా.. తెలుగుదేశం పార్టీ నుంచి ఎన్నికైన వారు నలుగురు కౌన్సిలర్లు ఉన్నారు. బీజేపీ నుంచి ఒకరుండగా కూటమి సభ్యుల సంఖ్య 13కు చేరింది.



ఎమ్మెల్యే విజయచంద్ర ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్లు

ఘనంగా దాలేలమ్మ తల్లి పండుగ

6లో

ప్రమాదకరంగా.. వేలాడుతూ

6లో

గౌరీ ఉత్సవాలు చూతము రారండి!



ఐదేళ్లకొకసారి ఐదు నెలల పాటు నిర్వహించే గౌరీ ఉత్సవాలు.. ఆకట్టుకుంటున్న పరమేశ్వరుడు, గౌరీదేవి, నందెన్న విగ్రహాలు



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన శ్రీరామ పట్టాభిషేకం



జీవం ఉట్టిపడేలా మట్టితో తీర్చిదిద్దిన రైతు కుటుంబం విగ్రహం

● ఐదు నెలల పాటు నిర్వహణ ● ఇదీ తుమరాడ విశిష్టత

పాలకొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి)

నందన్న ఉత్సవాలు (గౌరీ ఉత్సవాలు) ఎక్కడైనా 9 లేదా 11 రోజులు నిర్వహించడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని తుమరాడ గ్రామంలో ఐదేళ్లకొకసారి ఐదు నెలల పాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తుంటారు. తుమరాడ గ్రామంలో సుమారు వంద కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు ఉన్నాయి. వీరు తరతరాలుగా గౌరీ, నందన్న ఉత్సవాలను ఐదేళ్లకొకసారి ఐదు నెలల పాటు ఘనంగా నిర్వహిస్తుంటారు. అత్యంత వైభవంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు, ప్రతిరోజూ భజనలు చేస్తారు. ఇందు కోసం నెల రోజుల పాటు దేవతా మూర్తుల విగ్రహాలను మట్టితో సుందరంగా తీర్చిదిద్ది ప్రతిష్ఠిస్తారు. ఈ ఉత్సవాలను తిలకించేందుకు పాలకొండ మండలంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కొంతమంది భక్తులు వస్తుంటారు. గ్రామానికి చెందిన కుమ్మరి కుటుంబీకుల వారు సొంత ఖర్చులతోనే ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. వ్యయ ప్రయాసలు ఉన్నప్పటికీ నేటికీ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నట్టు ఆ కుటుంబీకులు చెబుతున్నారు. గత ఏడాది అక్టోబరు 17న గౌరీ ఉత్సవాలను తుమరాడలో ప్రారంభించారు. వచ్చే మార్చి 17 వరకు వైభవంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకుంటున్న విగ్రహాలు..

గౌరీ ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల మట్టి విగ్రహాలు ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి... భక్తులు పూజలు చేసేందుకు వీలుగా వీటిని తీర్చిదిద్దారు. నందన్న, ఈశ్వరుడు, పార్వతి, వినాయక వి గ్రహాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. శ్రీరామ పట్టాభిషేకం పూర్తి సారాంశాన్ని వివరించేలా ఏర్పాటు చేసిన మట్టి విగ్రహాలు భక్తులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. రైతు కుటుంబం వ్యవసాయ పనుల కోసం వెళుతున్నట్టు ఏర్పాటు చేసిన విగ్రహాలు కూడా పరవశింపజేస్తున్నాయి. నిర్వాహకులు కొత్తూరు రామకృష్ణ వినాయకచవితి, దసరా నవరాత్రి ఉత్సవాలకు మట్టి విగ్రహాలను తయారు చేసి రాష్ట్ర స్థాయిలో పేరు సంపాదించారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌కు బదులుగా మట్టితోనే బొమ్మలు తయారు చేస్తున్నట్టు వివరించారు. ఈ గ్రామానికి చెందిన మరో వంద కుటుంబాలు మట్టి వి గ్రహాల తయారీపైనే ఆధారపడి జీవిస్తున్నాయి.

సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం..

మేం ఐదేళ్లకొకసారి ఐదు నెలల పాటు గౌరీ ఉత్సవాలను నిర్వహిస్తాం. పూర్వం నుంచి ఆచారంగా ఇది వస్తోంది. వ్యయ ప్రయాసలతో కూడినదే అయినా ఈ ఉత్సవాలను విధిగా కొనసాగిస్తున్నాం.

-కొత్తూరు రామకృష్ణ, నిర్వాహకులు

ఈ ఉత్సవాలే ప్రత్యేకం..

గౌరీదేవి ఉత్సవాలు మా గ్రామానికి ప్రత్యేకమేనని చెప్పక తప్పదు. ఐదేళ్లకొకసారి ఐదు నెలల పాటు ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తాం. మా గ్రామానికి చెందిన వారు ఎక్కడ ఉన్నా.. ఈ ఐదునెలల్లో ఏదో ఒక రోజు గౌరీ పార్వతుల దేవతామూర్తులను దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి భక్తులు వస్తుంటారు.

-నెల్లి సత్యంనాయుడు, టీచర్, తుమరాడ

అమ్మబోతే రూ.4 కొనబోతే రూ.15

● టమోటా ధరలు ఇవీ.. నష్టపోతున్న అన్నదాతలు



టమోటాలను కొనుగోలు చేసేవారు లేక నిరీక్షిస్తున్న రైతు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 20: రైతుకు గిట్టేది మాత్రం రూ4. కానీ అదే సరుకు మార్కెట్‌లో కొంటే రూ15. మార్కెట్ మాయాజాలం ఇది. చివరకు నష్టపోయేది మాత్రం రైతులు. జిల్లాలో టమోటా ధరలు భారీగా పడిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం వరకు కిలో ధర రూ.15 ఉండేది. గురువారం నాటికి 25 కేజీలు రూ.120 నుంచి రూ.100కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో కేజీ టమోటా రూ.60 నుంచి రూ.70 వరకు ఉండేది. జిల్లా కేంద్రం చుట్టు పక్కల మండలాల్లో ఈ పంట విస్తారంగా సాగు చేశారు. ఈ ఏడాది జనవరి నెలాఖరు వరకు టమాటా ధరలు నిలకడగా ఉన్నా ఫిబ్రవరి రెండో వారం నుంచి తగ్గుతూ వచ్చాయి. మూడు రోజుల నుంచి స్థానిక మార్కెట్‌లో కేజీ రూ.10కు కూడా కొనేందుకు వ్యాపారులు ముందుకు రాలేదు. కొంతమంది రైతులు మార్కెట్‌కు తెస్తే రవాణా ఖర్చులు కూడా రావని.. పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. గురువారం ప్రధాన మార్కెట్‌లో కిలో రూ.5కు కొనేవారు లేరు. రైతుల నుంచి అతి తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు మాత్రం బయట కిలో రూ.15కు అమ్ముతున్నారు.

బాడీ బిల్డింగ్‌లో వెంకటేశ్ ప్రతిభ

బొబ్బిలి, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతి సందర్భంగా బొబ్బిలిలో నిర్వహించిన ఉత్తరాంధ్ర స్థాయి జోనల్ బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్-2025 పోటీల్లో పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణానికి చెందిన వెంకటేశ్ విజేతగా నిలిచాడు. స్థానిక రాజా కళాశాల మైదానంలో శ్రీహనుమాన్ దీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు బుధవారం అర్ధరాత్రి ముగిశాయి. విజేతకు ఎమ్మెల్యే బేబీనాయన చేతులమీదుగా రూ.15 వేలు, ట్రోఫీని అందజేశారు.

శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తా..

ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ బొబ్బిలి పట్టణంలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతిఏటా బాడీబిల్డింగ్ పోటీలు నిర్వహిస్తామని ఆయన ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్మ, టీడీపీ నాయకు లు పువ్వల శ్రీనివాసరావు, రాంబార్కి శరత్‌బాబు, గెంబలి శ్రీనివాసరావు, కాకల వెంకటరావు, హెచ్‌బీఎల్ జీఎం సుంకరపల్లి ఖన్నా పాల్గొన్నారు.



విజేతకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన



పోటీల్లో పాల్గొన్న యువకులు

ఘనంగా దాలేలమ్మ తల్లి పండుగ



కళశాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుల్లిపల్లి వీధిలో గల దాలేలమ్మకు గురువారం ఘనంగా పండుగ నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా పట్టణంలోని నవదుర్గా ఆలయం వద్దకు అమ్మవారిని తీసుకెళ్లి, అక్కడ పూజలు చేశారు. అక్కడి నుంచి తిరిగి అమ్మవారి ఆలయానికి మేళతాళాల మధ్య తీసుకొచ్చారు. మధ్యాహ్నం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు పట్నాన కుటుంబాల ఆధ్వర్యంలో నిర్వహించారు.



శక్తి వేషాల ప్రదర్శన

ప్రమాదకరంగా.. వేలాడుతూ

మండల కేంద్రంలో విద్యార్థులకు నిత్యం ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. గురువారం సాయంత్రం బత్తిలి వైపు వెళ్లే ఐదు గంటల బస్సు రాకపోవడంతో ఆరు గంటలకు వచ్చిన బస్సుకు విద్యార్థులు ప్రమాదకర స్థితిలో వేలాడుతూ వెళ్లాల్సి వచ్చింది. బస్సు కోసం గంటల తరబడి తప్పని నిరీక్షణ, తోపులాటలు, కిక్కిరిసి ప్రయాణం.. ఇది ఇక్కడ నిత్య కృత్యం. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన 500 మంది, జూనియర్ కళాశాలకు చెందిన 250 మంది, హైస్కూల్‌కు చెందిన వంద మంది విద్యార్థులు బత్తిలి, పెద్దదిమిలి వంటి దూర ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుంటారు. అయితే బత్తిలి వైపు నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు రావడం, ఆ సమయానికి బస్సులు లేకపోవడం నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు. విద్యార్థుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని బత్తిలి వైపు ఐదు గంటల తర్వాత వచ్చిన బస్సులు కొనసాగించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

-భామిని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)



వంకాయలను పారేశారు



రామభద్రపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కూరగాయల పంటలు సాగుచేస్తున్న రైతుల పరిస్థితి రోజురోజుకి దయనీయంగా మారుతోంది. కొద్దిరోజులుగా టమోటా కిలో రూ.4కు పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు వంకాయలు కూడా కిలో రూ.2 మాత్రమే ఉండడంతో చాలా మంది రైతులు బయట పారేస్తున్నారు. మార్కెట్‌కు తీసుకుని వెళ్తే రవాణా ఖర్చులు కూడా రావని చెబుతున్నారు.

ఆలోచింపజేసిన రైతేరాజు



నాటిక పోటీలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, చనమల్లు

- సాగు సమస్యలను కళ్లకుగట్టినట్లుగా నాటిక
- నేటి పరిస్థితిని చాటి చెప్పిన 'ఎడారిలో వాన చినుకు'
- జరజాపుపేటలో ప్రారంభమైన నాటిక పోటీలు

నెల్లిమర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జరజాపుపేట శ్రీ ఆరిపాక బ్రహ్మానందం స్మారక నాటక పరిషత్‌లో గురువారం నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు ప్రదర్శనలు నేటి పరిస్థితులకు అద్దం పట్టేలా ఉన్నాయి. ప్రముఖ నాటక రంగ కళాకారుడు, అవార్డుల గ్రహీత స్వర్గీయ బ్రహ్మానందం మాస్టారి పేరిట ఆయన కుటుంబీకులు ఈ నాటికల పోటీలను మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. తొలిరోజు ఈ పోటీలను టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, డీసీసీబీ మాజీ చైర్మన్ చనమల్లు వెంకటరమణ లాంచనంగా ప్రారంభించారు. నటరాజ్ విగ్రహం వద్ద జ్యోతి వెలిగించారు అనంతరం బ్రహ్మానందం చిత్ర పటానికి పూల మాలలువేసి నివాళులు అర్పించారు.

● తొలుత హైదరాబాద్‌కు చెందిన కళాంజలి సంస్థ కళాకారులు రైతే రాజు నాటికను ప్రదర్శించారు. దేశానికి వెన్నెముకగా నిలిచిన రైతన్నల బతుకులు ఈ రోజు వీధిన పడ్డాయని నాటికలో కళ్లకుకట్టినట్లు చూపించారు. గుండు సూది నుంచి విమానం దాకా ఎవరు వస్తువు తయారు చేసినా ధర నిర్ణయించుకునే హక్కు వారికి ఉంటుందని, కానీ రైతు పండించిన పంటకు ధర నిర్ణయించుకునే హక్కు లేదని తనకు ఉండదని అందులో చూపించారు. అప్పుల్లో కూరుకుపోతున్న రైతులు పంటకు సెలవు ప్రకటిస్తే దేశంలో ఆహార కొరత ఏర్పడుతుందన్న అంశం ఆలోచింపజేసేలా ఉంది. ఈ నాటికను కంచర్ల సూర్యప్రకాష్ రచించగా, కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

● రెండో నాటిక 'ఎడారిలో వాన చినుకు' కాకినాడ సాయి కార్తీక్ క్రియేషన్స్ కళాకారులు ప్రదర్శించారు. సురేష్ తన తల్లిదండ్రులు శారదమ్మ, సుందరయ్యను వృద్ధాశ్రమంలో వదిలేస్తాడు. అమెరికా నుంచి వచ్చిన మనోజ్ వారిని తన తల్లిదండ్రులుగా దత్తత తీసుకోవాలని అనుకుంటాడు. అయితే సురేష్ వారిని పాతిక లక్షలకు బేరం పెడతాడు. దీంతో ఆగ్రహించిన ఆ తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఈ నాటిక ప్రధానాంశం. కళాకారుల నటన ఆకట్టుకుంది. ఈ నాటికను శారద ప్రసన్న రచించగా, సిహెచ్ మహేష్ దర్శకత్వం వహించారు.



రైతేరాజు నాటికలో ఓ సన్నివేశం

సర్వర్ మొరాయింపు

●భూముల రిజిస్ట్రేషన్లకు అంతరాయం ● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పడిగాపులు

గజపతినగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సర్వర్లలో తలెత్తిన సాంకతిక లోపాలతో జిల్లాలో రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం ఏర్పడుతోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్వర్లు మొరాయించడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద క్రయ, విక్రయదారులు పడిగాపులు పడుతున్నారు. బుధవారం నుంచి గురువారం మధ్యాహ్నం వరకు సర్వర్ మొరాయించింది. దీంతో కార్యాలయానికి వచ్చిన క్రయ, విక్రయదారులు ఇబ్బందులకు గురయ్యారు. మధ్యాహ్నం 12 గంటల దాటిన తరువాత సర్వర్లు పని చేసినప్పటికీ పదేపదే సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్లు అరకొరగా కొనసాగాయి. సర్వర్ పనిచేసే సమయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టినప్పటికీ ఈ-సైన్ అవ్వక పోవడంతో రిజిస్ట్రేషన్లు నిలిపి వేస్తున్నారు. ఈ-సైన్ విధానంలో రిజిస్ట్రేషన్లు నిర్వహించడంతో మొత్తం ప్రక్రియలో ఇదే కీలకంగా మారింది. దీంతో భూక్రయ, విక్రయదారులు అవస్థలకు గురయ్యారు.



కార్యాలయం ఎదుట వేచి ఉన్న భూ క్రయ, విక్రయదారులు

గజపతినగరం సబ్ రిజి స్ట్రార్ కార్యాలయంలో 8 మండలాల పరిధిలోని 130 గ్రామాలకు సంబంధించిన భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. సదూర ప్రాంతాలనుంచి వచ్చిన వారు సర్వర్ పనిచేయక పోవడంతో రెండు రోజులుగా వేచి ఉండాల్సి పరిస్థితి నెలకొనడంపై భూక్రయ, విక్రయదారులు ఆవేదన చెందుతున్నారు.

●ఇదే విషయమై సబ్ రిజిస్ట్రార్ తవిటయ్యను వివరణ కోరగా రాష్ట్రవ్యాప్తంగా ఈ సమస్య తలెత్తుతోందన్నారు. బుధవారం నుంచి గురువారం మధ్యాహ్నం వరకూ సర్వర్ మొరాయించిందన్నారు. ఆ తర్వాత సర్వర్ పనిచేయడంతో రిజిస్ట్రేషన్లు చేశామన్నారు.

'చట్టాలు, వ్యవస్థల మీద జగన్‌కు గౌరవం లేదు'

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చట్టాలు, వ్యవస్థల మీద వైఎస్ జగన్‌కు గౌరవం లేదని టీడీపీ ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. పోలీసు వ్యవస్థను కించపరిచేలా, పోలీసుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ మాట్లాడారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ కలిశెట్టి మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బల ప్రదర్శన చేయడానికి మిర్చి యార్డును వేదికగా వైసీపీ నాయకులు వేదికగా చేసుకున్నారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చీప్ లిక్కర్ అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్లబ్బులు, పేకాట శిబిరాలు, కేసినోలు ఏర్పాటు చేసి అధికార దుర్వినియోగానికి నాటి వైసీపీ ప్రభుత్వం పాల్పడిందని ఎంపీ కలిశెట్టి ఆరోపించారు.

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు బుకీల అరెస్టు

మహారాణిపేట (విశాఖపట్నం), ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యువతను క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు చేస్తున్న ఇద్దరు బుకీలను విశాఖ పోలీసులు చాకచక్యంగా అరెస్టు చేశారు. గాజువాకకు చెందిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. తక్కువ డబ్బుతో ఎక్కువ లాభాలు వస్తాయని ఆశ చూపించి క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు చేస్తున్నారని, తమ వద్ద ఉన్న డబ్బంతా ఖాళీ చేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయనగరం జిల్లాకు చెందిన ఇద్దరు ముఠా సభ్యులను విశాఖ పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా పట్టుకున్నారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు పం పారు. ఎవరైనా ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా బెట్టింగ్‌రాయుళ్లకు సహకరిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కమి షనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. టోల్ ఫ్రీ నెంబరు 1930కు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

గజపతినగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్.జి.ఆర్.పురం సమాపం మామిడితోటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడి చేశారు. పేకాట రాయళ్లను అరెస్టు చేసినట్టు ఎస్ఐ లక్ష్మణ రావు తెలిపారు. వారి నుంచి రూ.10,655 నగదు, 3 సెల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

నేడు నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా కట్

గజపతినగరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం మండలంలోని చల్లపేట ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం నాలుగు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు బొబ్బిలి డివిజన్ డీఈ అనంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సాలిపేట, మెంటాడ, మారి వలస, వెంకంపేట, చిట్టయ్యవలసలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న నిరసన

గరివిడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గరివిడి పశువైద్య కళాశాల విద్యార్థుల నిరసన గురువారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తాము కోరుతున్న న్యాయపరమైన కోరికలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ పోరాటాలను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

ఉత్తమ ఫలితాలు సాధించండి

నెలిమర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డిప్యూటీ డీఈవో కె.వి.రమణ సూచించారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదోతరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

సభ్యత్వ కార్డుల పంపిణీ

రాజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కోండ్రు జగదీశ్, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీను, గేదెల బాలమురళీకృష్ణ, వంగా వెంకటరావు, మరిపి జగన్మోహన్‌రావు, ఎల్.కృష్ణమూర్తి ఉన్నారు.

రఘువర్మను గెలిపించండి

మెంటాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి కోరారు. రఘువర్మకు మద్దతుగా ఆమె గురువారం మండలంలోని పోరాం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను ఆమె కలిశారు. రఘువర్మకు మొదటి ప్రాధాన్యం ఓటు వేయాలన్నారు. ఆమెతో పాటు చలుమూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

● రాజాం: టీడీపీ కూటమి ప్రభుత్వం బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గెలుపునకు అందరు కలిసి కట్టుగా పనిచేయాలని ఎమెల్యే కోండ్రు మురళీమోహన్ సూచించారు. గురువారం శ్యాంపురం పార్టీ క్యాంపు కార్యాలయంలో రాజాం, వంగర, రేగిడి, సంతకవిటి మండలాల నాయకులతో పాటు అర్బన్ నాయకులు, ఉపాధ్యాయ సంఘాలతో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజాం నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీని ఇచ్చి పార్టీ అధిష్టానం దగ్గర మంచి గుర్తింపును తీసుకురావాలన్నారు.

●విజయనగరం: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాకలపాటి రఘువర్మను గెలిపించుకోవాలని ఎమ్మెల్యే అదితి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆమె కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధిష్టానం సూచనల మేరకు రఘువర్మను గెలిపించాలన్నారు. ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా కృషి చెయ్యాలని కోరారు.

●లక్కవరపుకోట: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి మద్దతుదారుడు పాకలపాటి రఘువర్మను ఉపాధ్యాయులు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కోరారు. గురువారం ఆమె కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.శేఖర్‌పాత్రుడుతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఏపీ మోడల్ స్కూల్, కేజీబీవీ, జడ్పీ హైస్కూల్‌లో ఆమె ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, మాజీ జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, జీఎస్ నాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మల్లా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో మంత్రి సంధ్యారాణి



విజయనగరం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదితి



రాజాం: దిశా నిర్దేశం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు



ఎల్.కోట: కరపత్రాల పంపిణీలో ఎమ్మెల్యే లలితకుమారి

'గురుదేవ'కు అంబులెన్స్ వితరణ

కొత్తవలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు సహాయ సహకారాలను అందిస్తామని దక్షిణ ఆసియా ఎల్‌పీజీ కంపెనీ సీఈవో, ఎండీ నవీన్ మఖిజ, ఇతర ప్రతినిధులు వికాస్‌వర్మ, శ్రీరామనాథ్ ప్రకటించారు. గురువారం మండలంలోని మంగళపాలెంలోని విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రిని వారు సందర్శించారు. ఈ సందర్భంగా కంపెనీ తరఫున అత్యాధునిక పరకరాలతో కూడిన అంబులెన్స్‌ను ట్రస్టు వ్యవస్థాపక ఛైర్మన్ రాపర్తి జగదీశ్‌బాబుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివిధ సేవాకార్యక్రమాలను అందిస్తున్న గురుదేవ చారిటబుల్ ట్రస్టుకు తమ వంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో అంబులెన్స్‌ను అందించామన్నారు. ట్రస్టు ద్వారా అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్‌ను వారు అభి నందించారు. కార్యక్రమంలో భాగంగా 100 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ ఛైర్స్, చెవిటి మిషన్లు, 100 మంది అంధులు, వృద్ధులకు పెన్షన్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వైస్‌ఛైర్మన్ డాక్టర్ ఫణీంద్ర పాల్గొన్నారు.



అంబులెన్స్‌ను అందజేస్తున్న ప్రతినిధులు

ఘనంగా పార్వతమ్మ జాతర

●అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తకొప్పెర్లలో నిర్వహిస్తున్న పార్వతమ్మ అమ్మవారి జాతరలో రెండోరోజు గురువారం భక్తులతో కిటకిటలాడారు. అమ్మవారికి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి దర్శించుకుని పసుపు కుంకుమలు సమర్పించారు. అనంతరం జనసేన పార్టీకి చెందిన మండల నాయకులు కోట్ల రఘు, బాల అప్పలరాజు నిర్వహించిన అన్నసమారాధనలో ఆమె పాల్గొని పేదలకు వడ్డించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సత్తిబాబు, లంకలపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాగమాధవి

ముత్యాలమ్మకు పూజలు

వేపాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం గ్రామదేవత ముత్యాలమ్మతల్లి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, రాంప్రసాద్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధనకు రూ.10 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దాసరి లక్ష్మి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పోతల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, వెంకటరమణ, జొన్నపల్లి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటల్లో ట్రెంచ్‌లు తవ్వండి

రేగిడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధి వేతనదారులుగా ఉన్న రైతుల పండ్ల తోటలు, పొలాల్లో ఫారం పాండ్స్ ట్రెంచ్‌లు తవ్వకాలు చేపట్టాలని ఏపీవో హరనాథ్ సూచించారు. గురువారం వీవీ రంగరాయపురంలో చేపడుతున్న తమ్మయ్య చెరువు పనులను ఆయన పరిశీలించారు. మస్తర్లు నిర్వహణ, ఎన్‌ఎంఎంఎస్ యాప్‌లో నమోదు ప్రక్రియపై ఆరా తీశారు.

వాట్సాప్ గవర్నన్స్‌పై ప్రచారం చేపట్టండి

● వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

విజయనగరం కలెక్టరేట్ ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాచార సాంకేతిక పరిజ్ఞానం సాయంతో మొబైల్ ద్వారానే ఇంటి వద్ద నుంచి అత్యంత సులువుగా ప్రభుత్వ సేవలు పొందేందుకు వీలుగా రూపొందించిన వాట్సాప్ గవర్నెన్స్‌ను వినియోగించు కునేలా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. ప్రస్తుతం 9552300009 వాట్సాప్ నెంబరు ద్వారా 158 రకాలు ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు అందజేస్తు న్నామన్నారు. రానున్న రోజుల్లో వెయ్యి సేవలు అందజేయనున్నట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వాట్సాప్ నెంబరు ప్రదర్శించాలన్నారు. జిల్లా కలెక్టర్లతో గురువారం సచివాలయం నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిం చారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్, ఏపీపీఎస్సీ గ్రూపు-2 పరీక్షలను పక్కాగా నిర్వహిం చాలన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రజా భాగస్వామ్యంతో చేపడుతున్న పి-4 కార్యక్రమాన్ని మార్చి 30న ప్రారంభించనున్నట్టు తెలిపారు. అత్యంత నిరు పేదల గుర్తింపు కోసం మార్చి 8 నుంచి సర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్‌ను ఆదేశించారు. మార్చి 6న జిల్లా అధికారులతో దీనిపై సమావేశం నిర్వహించనున్నామని, మార్చి 7న ఎంపీడీవోల ఆధ్వర్యంలో క్షేత్ర సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు. మార్చి 8న జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి చర్చిస్తామని చెప్పారు. కాన్ఫరెన్స్‌లో జేసీ సేతు మాధవన్, సీపీవో బాలాజీ, డీఈవో మాణిక్యంనాయుడు, డీపీ వో వెంకటేశ్వరరావు ఉన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

బర్డ్‌ఫ్లూపై వదంతులు నమ్మవద్దు

విజయనగరం రింగురోడ్డు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) బర్డ్‌ఫ్లూపై వదంతులు నమ్మవద్దని ఫుడ్ సేఫ్టీ అధికారి నాగుల్ మీరా అన్నారు. గురువారం హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బర్డ్‌ఫ్లూపై ఆయన అవగాహన కల్పించారు. 75 నుంచి 100 డిగ్రీల ఉష్ణోగ్రతతో గుడ్లు, మాంసం ఉడికించి తినడం వల్ల ఎటువంటి వైరస్, బాక్టీరియా నశిస్తుందన్నారు. అందువల్ల మాంసాహారం తినవచ్చన్నారు. హోటల్స్‌లో వండిన చికెన్ శాంపిల్స్ తీసుకుని పరీక్షించగా అందులో ఎటువంటి బర్డ్‌ఫ్లూ లక్షణాలు లేవని తేల్చి చెప్పారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరావు, శివకుమార్, బాబురావు ఉన్నారు.



మాట్లాడుతున్న నాగూల్ మీరా

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మెరకముడిదాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనువాసులునాయుడు అన్నారు. గురువారం మండలంలోని పలు పాఠశాలలను ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు వలిశెట్టి రవీంద్రనాయుడు, అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆల్తి రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు మహేష్ తదితరులున్నారు.



ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె

జీతాలు చెల్లించాలి

రాజాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సకాలంలో జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాజాం సబ్‌డివిజన్ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషల్లో షిఫ్ట్ ఆపరేటర్లు ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌ను కోరారు. గురువారం రాత్రి శ్యాంపురంలోని పార్టీ కార్యాలయంలోఎమ్మెల్యేను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. డిసెంబరు నుంచి జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వివరిం చారు. 2023-24లో ప్రభుత్వ సెలవు దినాలకు సంబంధించి జీతాలు జమ కాలేదని, 2021 నుంచి 2024 వరకు 20 నెలలు ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించలేదని ఫిర్యాదు చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా బంగారమ్మతల్లి తీర్థమహోత్సవం

వేపాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగంగుబూడిలో గ్రామదేవత బంగారమ్మతల్లి తీర్థమహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ మహోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. సాయంత్రం మహిళల కోలాటం ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.

వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం



అనుమానంతోనే భార్యను చంపేశాడు

●వివరాలు వెల్లడించిన బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి

క్రైం న్యూస్

దత్తిరాజేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): భార్యను చంపేసి పరారైన భర్తను బుధవారం రాత్రి పెదమానాపురం పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని ఈనెల 6న చుక్కపేట గ్రామానికి చెందిన యాకల గౌరమ్మను గుచ్చిమ గ్రామ సమీపంలోని ఆయిల్‌పామ్ తోటలో ఆమె భర్త యాకల సత్యనారాయణ హత్యచేసి పరారైన విషయం తెలిసిందే. గురువారం పెదమానాపురం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడిని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి ప్రవేశపెట్టారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ తన భార్య యాకల గౌరమ్మపై అనుమానంతో హతమార్చి పరారయ్యాడన్నారు. బొండపల్లి మండలం గొల్లుపాలెంలో 5 రోజుల పాటు గొర్రెల కాపరిగా పనిచేసి అక్కడ డబ్బులు సరిపోకపోవడంతో పెందుర్తిలో కూలీగా పనిచేసుకుంటూ కొద్ది రోజులు గడిపాడన్నారు. భార్య బతికి ఉందో చనిపోయిందో తెలుసుకునేందుకు పెద మానాపురంలో తనకు తెలిసిన వారి ఇంటికి వచ్చాడన్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సత్యనారాయణను అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ ఆర్.వెంకటరమణ, పెదమానాపురం ఎస్ఐ ఆర్.జయంతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ భవ్యరెడ్డి

పూరిల్లు దగ్ధం

దత్తిరాజేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టి.బూర్జవలసలోని ఎస్సీ కాలనీలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదం జరిగింది. చింతగడ ప్రసాద్‌కు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడడంతో ఇంట్లోని ఫ్రిజ్, టీవీతో పాటు గృహోపకరణాలు కాలి బూడిదయ్యాయి. చింతగడ ప్రసాద్ కుటుంబం కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదంలో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్టు బాధితుడు తెలిపాడు.



దగ్ధమైన పూరిల్లు ఇదే..

చట్టం ఎదుట అందరూ సమానమే

రాజాం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): చట్టం ముందు అందరూ సమానమేనని న్యాయసేవాధికార సంస్థ మండల అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంబ స్పష్టం చేశారు. భారత రాజ్యాంగం ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం కల్పించిందన్నారు. అందుకు అనుగుణంగానే చట్టాలను రూపొందించిందని ఆమె గుర్తు చేశారు. గురువారం ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వేతనాలు, విద్యాహక్కు తదితర అంశాలపై ఆమె మాట్లాడారు. విద్యార్థులు-క్రమశిక్షణ, మాదకద్రవ్యాల వినియోగం, అనర్థాలు తదితర అంశాలపై టౌన్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.పురుషోత్తమరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి శారదాంబ

శివరాత్రి ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

శృంగవరపుకోట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి ఉత్సవాలకు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం సాయంత్రం సీఐ నారాయణమూర్తి ఆధ్వర్యంలో పుణ్యగిరిలోని ఉమా కోటిలింగేశ్వరస్వామిని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎస్.కోటలో ఎమ్మెల్సీ ఎన్నికలు, శివరాత్రి జాతరకు సంబంధించి 400 మంది పోలీసులను బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అనంతరం వాహనాల పార్కింగ్‌కు పలుచోట్ల సీఐ స్థలపరిశీలన చేశారు. ఆయనతో పాటు ఎస్ఐ గంగరాజు, పుణ్యగిరి ఆలయ అర్చకుడు సంతోష్‌శర్మ తదితరులున్నారు.



ఉమాకోటిలింగేశ్వరాలయంలో డీఎస్పీ

రామతీర్థంలో సీఐ పరిశీలన

నెలిమర్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రామతీర్థంలో ఈనెల 26, 27 తేదీల్లో నిర్వహించనున్న మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు భోగాపురం రూరల్ సీఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఎస్ఐ గణేష్‌తో కలిసి రామతీర్థం దేవస్థానాన్ని ఆయన సందర్శించారు. క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లపై మాట్లాడుతున్న సీఐ

సేవాలోపాలపై ఫిర్యాదు చేయవచ్చు

●సీజీఆర్ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ

కొత్తవలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సేవాలోపాలపై వినియోగదారులు ఫిర్యాదు చేయవచ్చునని విద్యుత్ సమస్యల పరిష్కార న్యాయస్థానం (సీజీఆర్ఎఫ్) ఛైర్మన్, మాజీ విశ్రాంత న్యాయాధికారి బి.సత్యనారాయణ తెలిపారు. గురువారం కొత్తవలసలోని విద్యుత్ సేవాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సభ్యులతో కలిసి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నానాటికీ విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అదేస్థాయిలో ఫిర్యాదు వస్తున్నాయన్నారు. తమకు ఫిర్యాదు చేస్తే సమస్య పరిష్కరిస్తామన్నారు. ఇందుకోసం వినియోగదారులు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, లో వోల్టేజీ సమస్య, సరఫరాలో హెచ్చు తగ్గులు, కొత్త సర్వీసు మంజూరులో జాప్యం, మీటర్లు పనిచేయక పోయినా పట్టించుకోకపోవడం, సర్వీసును బదిలీ చేసుకోవడం, కరెంట్ వాడకపోయినా అధిక బిల్లులు, మీటరు కాలిపోతే సకాలంలో కొత్త మీటరు బిగించకపోవడం తదితర వాటిపై ఫిర్యాదులు చేయవచ్చన్నారు. లేకుంటే 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ ద్వారా తెలియపరచవచ్చన్నారు. కార్యక్రమంలో సీజీఆర్ఎఫ్ సభ్యులు బి.సులేఖరాణి, ఎస్.కె.బాబర్, ఎస్.మోహన్‌కృష్ణ, విద్యుత్ శాఖ డీఈ బి.వెంకటరావు, కొత్తవలస, వేపాడ, లక్కవరపుకోట మండలాలకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.



ఫిర్యాదును స్వీకరిస్తున్న ఛైర్మన్ సత్యనారాయణ

ఇంకా 150 ఉన్నాయ్!

(ఐదో పేజీ తరువాయి)

● భామిని మండలంలో కోటగుండ, కోసిమానుగూడతో పాటు మరో మూడు గిరిజన గ్రామాలు తివ్వకొండపై ఉన్నాయి.

● జియ్యమ్మవలస మండలం పీటీ మండ పంచాయతీలో చాపరాయిగూడ, దీసరిగూడ, బాపన్నగూడ. టీకే జమ్ము పంచాయతీలో కోడిపిల్లగూడ, కూటం, పాండ్రసింగి. కొండ చిలకాం పంచాయతీలో ద్రాక్షిణి, అర్నాడ పంచాయతీలో అర్నాడవలస.

● మక్కువ మండలంలో లింగడవలస, బూరాడగెడ్డవలస, పాలికవలస, బీరమాసి, కొంజపాకతో పాటు మరికొన్ని గ్రామాలు.

● సాలూరు మండలంలో తెల్లపాక, నేరెంజిపాడు, టెన్సిరాయ్, రూఢి, సిరివర, చింతామల, తోర గ్రామాలతో పాటు మరో 14 గ్రామాలు.

● సీతంపేట మండలంలో 14 గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం

మా పంచాయతీ పరిధిలో దీసరిగూడ, బాపన్నగూడ, చాపరాయిగూడ గిరిజన గ్రామాలకు రోడ్డడ సౌకర్యం లేదు. దీంతో ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆ గ్రామాలకు బీటీ రోడ్డు మంజూరు చేయాలి.

- ఆరిక శారద, సర్పంచ్, పీటీ మండ, జియ్యమ్మవలస మండలం

పట్టించుకోవట్లే..

మేము అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే మా గ్రామాలకు రోడ్లు ఉండాలి. ఇక్కడకు వచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులకు మా గోడు విన్నవించినా ఫలితం లేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇది సరైన పద్ధతి కాదు.

- బిడ్డిక బడమ, గిరిజనుడు, జలగగూడ, ఒబ్బంగి పంచాయతీ

కొళాయిలు సరే.. నీరేదీ?

● ఇబ్బంది పడుతున్న ఎం.బూర్జవలస వాసులు

బొబ్బిలి రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.బూర్జవలస గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా వేసిన ఇంటింటి కొళాయిలు సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో తాగునీరు అందక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇంటింటి కొళాయిలు వేసినా నీరు రావడం లేదని గ్రామస్థులు అంటున్నారు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రక్షిత తాగునీటి పథకం నిరుపయోగంగా ఉంది. చేతి పంపు బోర్లు నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. నిధులు ఖర్చయ్యాయి తప్ప ప్రజలకు ఎలాంటి ఫలితం లేదు. ప్రతి ఇంటికీ నీరందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులతో వీటిని ఏర్పాటు చేశారు, కానీ ఫలితం లేక పోయింది. నిధులు ఖర్చు చేశారు తప్ప, నీరందక గ్రామస్థులకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. నీటి లభ్యతతో పనిలేకుండా ఎడాపెడా కనెక్షన్లు ఇచ్చేశారు. నీటి లభ్యత లేకుండా ఇచ్చిన కనెక్షన్లు అలంకారప్రాయంగా మిగిలాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరారు. ● ఈ విషయం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ డిల్లేశ్వరరావుని వివరణ కోరగా.. గ్రామస్థులు కొళాయిలు విరిచేస్తున్నారని, ప్రెజర్ లేకపోవడంతో అన్ని కొళాయిలకు నీరందడం లేదని తెలిపారు. తదుపరి బడ్జెట్‌లో వీటిని సరిచేసే బాధ్యత తీసుకుంటామని అన్నారు.



ఎం.బూర్జవలసలో నిరుపయోగంగా ఉన్న కొళాయిలు

కూటమి అభ్యర్థిని గెలిపించండి

మక్కువ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాలకపాటి రఘువర్మను గెలిపించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. శంబర జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు. ● కురుపాం: కూటమి బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మను గెలిపించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. గురువారం కురుపాంలోగల వివిధ పాఠశాలలు, కళాశాలల్లో ఆమె ప్రచారం నిర్వహించారు. తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, టీడీపీ మండల కన్వీనర్ కేవీ కొండయ్య, మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న రఘువర్మను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే జగదీశ్వరి పిలుపునిచ్చారు. గురువారం ఆమె పెదబుడ్డిడి, చినకుదమ జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు డొంకాడ రామకృష్ణ, బొంగు సురేష్, దత్తి లక్ష్మణరావు, పల్ల రాంబాబు పాల్గొన్నారు. ● సాలూరు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మ గురువారం సాలూరు పట్టణంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలో ఉన్న బొడ్డవలస, మామిడిపల్లి, అంటివలస, పురోహితునివలస గ్రామాల్లో ఉన్న ఉన్నత పాఠశాలలను సందర్శించారు. తనకు ప్రథమ ప్రాధాన్యతా ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు. ● బెలగాం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థి రఘువ ర్మను గెలిపించాలని ఎమ్మెల్యే విజయచంద్ర కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, బ్రాంచ్ హైస్కూల్, బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి, రఘువర్మకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు.



మక్కువ: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి



కురుపాం: ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి



బెలగాం: అధ్యాపకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోనెల



సాలూరు: ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మ

పరిశీలకుల నియామకం

జియ్యమ్మవలస, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నరసన్నపేట నియోజకవర్గ పరిశీలకునిగా అరకు పార్లమెంటు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతనిధి డొంకాడ రామకృష్ణను అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీలో ఉన్న పాకలపాటి రఘువర్మ గెలుపునకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. ● కురుపాం: ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండపేట నియోజకవర్గం కూటమి పార్టీ పరిశీలకుడిగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్రదేవ్‌ను నియమించింది. ఈసందర్భంగా ఎన్నికల కార్యచరణపై మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావుతో చర్చించినట్టు ఆయన తెలిపారు. కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేరబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేస్తామన్నారు. ● బాడంగి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడిగా కొప్పలవెలమ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లి అప్పలనాయుడు నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. కూటమి మద్దతు ఇచ్చిన అభ్యర్థి పాకలపాటి రఘువర్మ విజయానికి కృషి చేస్తానని, పార్టీ అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానని తెలిపారు.

ఆరోగ్య సర్వే చేపట్టాలి



ఆరోగ్య సర్వే రికార్డులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

గరుగుబిల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యాధి లక్షణాలు సకాలంలో గుర్తించేందుకు ఆరోగ్య సర్వే చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు అన్నారు. గురువారం ఆయన ఉల్లిభద్ర గ్రామాన్ని సందర్శించి, ఆరోగ్య సర్వేలపై ఆరా తీశారు. ఎన్‌సీడీ, స్కూల్ హెల్త్, లెప్రసీ, ఇతర వ్యాధుల గుర్తింపునకు సంబంధించి సర్వే, స్క్రీనింగ్ గ్రామాల్లో ఏ మేరకు చేపడుతున్నారోనని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలను సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ వివరాల రికార్డులతో పాటు హిమోగ్లోబిన్ శాతం నివేదికలు, భవిత కార్డుల్లో నమోదు తీరును పరిశీలించారు. గతంలో గుర్తించిన సికిల్‌సెల్ ఎనీమియా విద్యార్థి ఆరోగ్య వివరాలు తెలుసుకుని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఎపిడెమిక్ ఈవో సత్తిబాబు, వైద్య సిబ్బంది కె.అనిత, ఎం.మాలతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐఐఈఏకి గుర్తింపు ఇవ్వాలి



సమ్మెను నిర్వహిస్తున్న ఏఐఐఈఏ సభ్యులు

పార్వతీపురంటౌన్/బెలగాం ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీలో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏఐఐఈఏ)కు గుర్తింపు ఇవ్వాలని పార్వతీపురం యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ధర్మారావు, ఆర్‌వీఎస్ ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద ఎల్‌ఐసీలో భాగమైన క్లాస్-3, క్లాస్-4 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐఐఈఏ బేస్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శుల ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏకపక్ష నిర్ణయాల వల్ల ఎల్‌ఐసీ భవిష్యత్తు ప్రమాదకరమన్నారు. ఎల్‌ఐసీలో అసిస్టెంట్, సబ్ స్టాఫ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. వీరికి ఎల్‌ఐసీ పింఛన్‌దారుల సంఘం మద్దతు తెలిపింది.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోండి

వీరఘట్టం, ఫిబ్ర వరి 20 (ఆంధ్ర జ్యోతి): ప్రతిఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకో వాలని ఎమ్మెల్యే జయకృష్ణ అన్నారు. మండలంలోని వీరఘట్టం పంచాయ తీ కార్యాలయం ఆవరణలో గురువారం విశాఖపట్నం ఒమేగా ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఉమెన్ క్యాన్సర్ కేర్ లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ అంతటా ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు, అవగాహనా కార్య క్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. క్యాన్సర్ వైద్య నిపుణురాలు శృతి, వీరఘట్టం పంచాయతీ ఈవో రవి, బల్లా హరిబాబు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో నాయకత్వ లక్షణాలు

బలిజిపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయని బలిజిపేట ఎంఈవో-1 సామల సింహాచలం అన్నారు. గురువారం అయన స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌గా ఎంపిక చేసిన 31 మంది విద్యార్థులకు హెచ్‌ఎం పి.శ్రీనివాసరావుతో కలిసి ప్రత్యేక దుస్తులను అందజేశారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఏర్పాటుకు హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో-2 కె.శ్రీనివాసరావు, స్కౌట్ మాస్టర్ టి.పరశురాం, గైడ్ టీచర్ పుణ్యవతి, స్టాఫ్ సెక్రటరీ ఎం.పైడపునాయుడు, బీపీ రమణ, బొత్స గణేష్, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లు

గుమ్మలక్ష్మీపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గురువారం ఎంఎస్‌ఎంఈ రిజిస్ట్రేషన్లు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది గ్రామంలోని షాపుల వద్దకు వెళ్లి, నిర్వాహకులతో రిజిస్ట్రేషన్లు చేయించారు. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవారికి ఆర్థిక సహాయం చేయడానికి భారత ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈని ఏర్పాటు చేసిందని చెప్పారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి, బ్యాంకు నుంచి రుణాలు, ఆదాయపు పన్ను, మినహాయింపులు, పరి శ్రమల ఏర్పాటుకు లైసెన్స్‌లు మంజూరవుతాయన్నారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి

బెలగాం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జీడి మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. గురువారం పార్వతీపురంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జీడి మామిడి రైతుల సమస్యలపై రైతు సంఘం నేతలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. జీడి మామిడికి గిట్టుబాటు ధర లేక గిరిజనులు దళారుల చేతిలో మోసపోతున్నారని, క్వింటాకు రూ.20 వేలు మద్దతు ధర ప్రకటించి గిరిజన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజనులు అధికంగా సాగుచేస్తున్న ప్రాంతానికి అందుబాటులో ఉన్న కురుపాంలో జీడి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని కోరారు. అటవీ ఉత్పత్తుల కొనుగోలుకు ఏర్పాటు చేసిన జీసీసీ నామమాత్రంగా పని చేస్తుందని, గిరిజనులకు అన్యాయం జరుగుతుందని తెలిపారు. జీసీసీ సమర్థవంతంగా పనిచేస్తే గిరిజనులు దళారుల బారిన పడకుండా ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఈవీవీ నాయుడు, రాంమూర్తి, పువ్వల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి జగన్ పరామర్శ



రాజశేఖరం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

పాలకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం పాలకొండ విచ్చేశారు. ఇటీవల మృతిచెందిన వైసీపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. రాజశేఖరం కుమారుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను, విక్రాంత్ సోదరి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని, రాజశేఖరం భార్య ఇందుమతిని ఆయన ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన.. ఇటీవల నగర పంచాయతీలో ఛైర్‌పర్సన్ ఎన్నికకు సంబంధించి వైసీపీ కౌన్సిలర్లంతా కూటమి నాయకుల ప్రలోభాలకు లొంగకుండా ఏకతాటిపై ఉండి పోరాడిన తీరును అభినందించారు. వైసీపీ మాజీ మంత్రులు ధర్మాన కృష్ణదాస్, సీదిరి అప్పలరాజు, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పుష్ప శ్రీవాణి, అరకు ఎంపీ తనూజారాణి, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ● వీరఘట్టం: మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలకొండ పర్యటన సందర్భంగా హెలిపాడ్ సమీపంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విజయనగరం జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసరావు.. జగన్ ప్రయాణిస్తున్న వాహనం వెనుక కొద్దిసేపు వేలాడడం కనిపించింది.

బాల్య వివాహాలను అరికట్టాలి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టాలని సీడీపీవో రంగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా గిరిజన విద్యార్థినిలకు బాల్య వివాహాలు, మహిళా చట్టాలు, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ ప్రొబిషన్ అధికారి పి.శ్రీధర్ చట్టాలపై విద్యార్థినిలకు వివరించారు. ఎంఈవో ఆనందరావు, పాఠశాల హెచ్‌ఎం వసంతలక్ష్మి, హెచ్‌డబ్ల్యూవో పి.అమల, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఔట్రిచ్ వర్కర్‌లు రావాడ హరికృష్ణ, సూపర్‌వైజర్‌లు జి.గౌరి, లావణ్య, మహిళా సంరక్షణ అధికారులు కమల, శిరీష పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలు పునాది

బలిజిపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యకు అంగన్‌వాడీ కేంద్రాలు పునాది వంటవని ఎంఈవో సింహాచలం అన్నారు. బలిజిపేటలో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా పూర్వప్రాథమిక విద్యలో నూతన విద్యా విధానాలపై ఆయన అవగాహన కల్పించారు. శిక్షణ రిసోర్సుపర్సన్లుగా వెంకటేష్, రమేష్ బాబు, రామారావు వ్యవహరించారు. ఎంఈవో-2 శ్రీనివాసరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సీడీపీవో సులేఖ పాల్గొన్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని చిన్నారులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని కొమరాడ ఐసీ డీఎస్ పీవో గొట్టాపు సుగుణకుమారి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణను ఆమె గురు వారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలు విధిగా కేంద్రాల్లో అమలు పర్చాలన్నారు. సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, రిసోర్స్‌పర్సన్లు వి.ధనుంజయనాయుడు, పి.వెంకటనాయుడు, కె.సింహాచలం పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి

వీరఘట్టం: వీరఘట్టం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఆర్.తేజేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న కృత్యాలు కేంద్రాల్లో అమలు చేయాలన్నారు. సమగ్ర శిక్షణ ఏపీవో హరి ప్రసాద్, డీఆర్పీలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, పాల్గొన్నారు.

నూతన ఉత్పత్తులతో ఆర్థిక సుస్థిరత

గరుగుబిల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నూతన ఉత్పత్తులతో ఆర్థిక సుస్థిరత సాధ్యమవుతుందని జిల్లా నాబార్డు డీడీ ఎం.సాదు దినేష్‌రెడ్డి అన్నారు. గురువారం తోటపల్లి జట్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో రైతు సాధికారిక సంస్థ, వ్యవసాయ శాఖలు సమన్వయంతో ప్రకృతి వ్యవసాయ రైతు శాస్త్రవేత్తలు మెంటార్‌లకు ప్రకృతి వ్యవసాయ పీహెచ్ డిప్లమా కోర్సు శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. నూతన పద్ధతులతో నూతన వంగడాలను సృష్టించి పండించిన పంటలకు పూర్తి స్థాయిలో పేటెంట్ హక్కులను పొందేలా దృష్టి సారించాలన్నారు. 365 రోజులు పంటలు పండేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. రైతు సాధికారిక సంస్థ సీనియర్ సిలబస్ కన్సల్టెంట్ డి.పారినాయుడు, జిల్లా పాయింట్ పర్సన్ ఎం.మానస, సాధికార సంస్థ కన్సల్టెంట్ తుంబలి శివాజీ, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

సీతంపేట రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని మన్యం జిల్లా ఏపీసీ ఆర్.తేజేశ్వరరావు అన్నారు. గురువారం సీతంపేట ఏజెన్సీలో పర్యటించిన ఆయన.. స్థానిక కేజీబీవీని తనిఖీ చేశారు. మెనూ అమలు, విద్యార్థినుల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించారు. చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి అందరూ కృషిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో ఏపీసీతో పాటు ఏంఈవో ఆనందరావు, ఎంఈవో 2లు సూర్యచంద్ర, సోంబాబులు ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా యల్లమ్మ జాతర

గరుగుబిల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గరుగుబిల్లిలో గురువారం యల్లమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. గరుగుబిల్లితో పాటు పలు గ్రామాల్లో యల్లమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఘటాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.

అకాల వర్షం



సింగిడిలో వర్షం కురుస్తున్న దృశ్యం

భామిని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తిలి నుంచి సింగిడి వరకు గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో అకాల వర్షం కురిసింది. ఒడిశా వైపు గుణుపూర్ నుంచి గాలులతో వర్షం కురవడంతో చల్లదనం కలిగిందని గ్రామస్థులు అంటున్నారు. అలాగే రబీలో వేసిన వరికి ఈ వర్షం మేలు చేకూరుస్తుందని, జీడి, మామిడికి అనుకూలంగా ఉంటుందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సారాతో ఇద్దరు మహిళల అరెస్టు

సాలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో గురువారం 1500 సారా ప్యాకెట్లు కలిగి ఉన్న ఇద్దరు మహిళలను పట్టుకున్నామని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. వారి వద్ద నుంచి సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన చెప్పారు. ఇందులో ఒక మహిళ ఒడిశా రాష్ట్రానికి చెందిన వ్యక్తి కాగా, మరో మహిళ పట్టణంలో ఎరుకుల వీధికి చెందిన వ్యక్తిగా గుర్తించామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నవగాం రూరల్ ఫీడర్ పరిధిలో వివిధ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలోని పనుకువలస, తుమరాడ, చింతాడ, దుగ్గి, నక్కపేట, అట్టలి, వాగుపాడు, టీడీ పారాపురం, టీకే రాజపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని చెప్పారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్

పాలకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని నగర పంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావు అన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం ఆయన కూరగాయలు, కిరాణా, పండ్ల వర్తకులతో సమావేశం నిర్వహించారు. పాలిథిన్ కవర్ల ప్రత్యామ్నాయం కోసం బయోడిగ్రేడుల్ కంపోజిటబుల్ క్యారీ బ్యాగ్స్ మ్యాన్‌ఫ్యాక్చర్ వారిని పిలిపించి వారితో సమావేశం నిర్వహించారు. ఇక నుంచి వర్తకులు ప్లాస్టిక్‌ను వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

జూదరుల అరెస్టు

రామభద్రపురం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కొత్తరేగ గ్రామంలో ఓ పశువుల శాలలో జూదం ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను గురువారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,020 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.